కిశోర వికాసంలో లింగ వివక్షపై అవగాహన

మాట్లాడుతున్న సూపర్ వైజర్ నాగసత్యవేణి

ప్రజాశక్తి - రావులపాలెం

ఈతకోట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ కొత్తపేట సిడిపిఒ ఎ.గజలక్ష్మి ఆదేశాలతో సూపర్ వైజర్ నాగసత్యవేణి ఆధ్వర్యంలో కిశోర వికాసం లో భాగంగా లింగ వివక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాగసత్యవేణి మాట్లాడుతూ కౌమార బాలికల సమస్యలు, పరిపూర్ణ ఆరోగ్యం, పోషణ అవసరాలు, పిల్లల సంరక్షణ, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆత్మ రక్షణ, వ్యక్తిగత పరిశుభ్రతలపై అవగాహన కల్పించి ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు, అంగన్‌వాడీడీ కార్యకర్తలు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ సేవలెలా..?

- డ్రైవర్లకు అరకొర వేతనాలే దిక్కు
- మూడు నెలలుగా పెండింగ్
- పెట్రోలు కొరతతో సేవలకు ఆటంకం
- సమ్మె బాటలో సిబ్బంది

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం అనంతరం తల్లీ, బిడ్డలను సురక్షితంగా, సౌకర్యవంతంగా ఇంటికి చేర్చేందుకు తీసుకువచ్చిన తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అరకొరగానే అందుతున్నాయి. ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వల్ల పేద, సామాన్య వర్గాలకు ఎంతో ఉపయోగపడుతున్న ఈ వాహనాలను కనీసంగా మరమ్మతులు చేయించడం లేదు. చివరకు పెట్రోలు బిల్లులు సైతం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని సిబ్బంది వాపోతున్నారు.

తల్లీ బిడ్డల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 2016 జనవరిలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పిహెచ్‌సి నుంచి జిల్లా ఆసుపత్రి వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవమైన తల్లీ బిడ్డ, వారితో ఉన్న కుటుంబ సభ్యులను ఉచితంగా వారింటికి క్షేమంగా చేరవేయడమే ఈ పథకం లక్ష్యం. ఉమ్మడి జిల్లాకు 31 వాహనాలు మంజూరు చేశారు. ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాకినాడకు 8, రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వాసుపత్రికి 5, తుని, అమలాపురం రెండేసి, పిఠాపురం, రౌతులపూడి, రామచంద్రపురం, తాళ్లరేవు, రాజోలు, కొత్తపేట, పెద్దాపురం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, రంపచోడవరం, అడ్డతీగల, చింతూరు, కూనవరంలో ఒక్కో వాహనం సేవలు అందిస్తున్నాయి. రోజుకి కనీసంగా 90 వరకు తల్లీబిడ్డలను ఇళ్లకు చేరుస్తున్నాయి.

అరకొర వేతనాలు ఆపై పెండింగ్

రోజురోజుకీ నిత్యవసరాలు వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో పేదలు, సామాన్యులు బతకాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఔట్ సోర్సింగ్ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు అరకొర వేతనాలను మాత్రమే ప్రభుత్వం ఇస్తుంది. వీటితో ఏ విధంగా కుటుంబాలను పోషించుకోవాలంటూ ఆయా వ్యవస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అందిస్తున్న డ్రైవర్లకు కేవలం నెలకు రూ.7,800 మాత్రమే వేతనం ఇస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నెలకు కనీసంగా రూ.30 వేలు ఉంటేనే గాని కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేదు. గత 8 ఏళ్లగా తక్కువ వేతనాలతో జీవనం సాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని అనేకసార్లు విన్నవించినా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదంటూ ఈ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 3 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు సైతం పుట్టక ఇబ్బందులు పడుతున్నామని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణపై నిర్లక్ష్యం

ఈ వాహనాల నిర్వహణను 2021 డిసెంబరు 31 వరకూ జివికె సంస్థ నిర్వహించింది. 2022 జనవరి 1 నుంచి అరబిందో నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. కానీ సంస్థ నిర్లక్ష్యం కారణంగా ఈ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదంటూ పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ నెలకు రెండు సార్లు మాత్రమే కొట్టించుకోవాలంటూ సంస్థ చెబుతుండడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బంది తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వలన ప్రస్తుతం 8 వాహనాలు మూలన పడ్డాయి. కాకినాడ జిల్లా కేంద్రంలో ఉన్న జిజిహెచ్‌లో 14 వాహనాలు ఉండగా 7 గురు మాత్రమే డ్రైవర్లున్నారు. దీంతో ఉన్న వారిపైనే ఒత్తిడి పెరుగుతోంది. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. అందుకే సంస్థలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఒకరోజు సమ్మె చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు.

ప్రభుత్వమే వేతనం ఇవ్వాలి

102 తల్లీబిడ్డ వాహనాలను ప్రభుత్వం నేరుగా నడిపి డ్రైవర్లకు ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి డ్రైవర్ల అందరిని పర్మినెంట్ చేయాలి. చట్టప్రకారం వీక్లీ ఆఫ్, పండుగలు, జాతీయ శెలవులు అమలు చేయించాలి.

- వల్లూరి కుమార్, డ్రైవర్, కాకినాడ జిజిహెచ్

వెట్టి చాకిరీ చేయిస్తున్నారు

తల్లీబిడ్డ వాహనాలపై పనిచేస్తున్న డ్రైవర్ల చేత 12 గంటలు డ్యూటీ చేయించుకుని కేవలం రూ.7,800 ఇవ్వడం దారుణం. చట్ట ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలి. 8 గంటల పని దినాలు అమలు చేయాలి. డ్రైవర్ల అందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వమే నిర్వహణ బాధ్యత తీసుకోవాలి.

- మలకా వెంకటరమణ, సిఐటియు జిల్లా కోశాధికారి, కాకినాడ

కనీస వేతనం ఇవ్వాలి

పెండింగులో ఉన్న బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలి. కనీస వేతనం రూ.18,500 చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. యజమాని వాటా పిఎఫ్ ను యాజమాన్యమే చెల్లించాలి. ప్రతి సిబ్బందికీ ఇఎస్ఐ చెల్లించాలి.

-పి.సాయి, అధ్యక్షుడు, ఎపి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్

సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

బకాయిలు చెల్లించాలని డిమాండ్

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లగా పనిచేస్తున్నటు వంటి కార్మికులకి తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అమలాపురం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, జిల్లా అధ్యక్షులు దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలు అయిన తల్లీబిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన ఈ సేవలను ఈ డ్రైవర్లు చాలా నిబద్ధతతో నిర్వహిస్తూ ఉన్నారని అన్నారు. అంత నిబద్ధతగా నిర్వహిస్తున్న డ్రైవర్లు యొక్క జీతాలు మాత్రం ప్రభుత్వం చిత్తశుద్ధితో చెల్లించడం లేదన్నారు. కేవలం వీరికి నెలకు రూ.7870 మాత్రమే వేతనం వస్తుందన్నారు..ఆ వేతనం కూడా గత మూడు నెలల నుంచి బకాయి పెట్టి ఉంచారన్నారు. ఇచ్చే వేతనం అరకొరకగా ఉంటూ అది కూడా మూడు నెలల నుంచి బకాయి పెడితే ఏ విధంగా డ్రైవర్లు కుటుంబాల్ని గడపాలని ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నించారు. మార్కెట్లో ధరలు రోజు రోజుకు పెరిగిపోతుంటే వీరి వేతనాలు మాత్రం ఏమాత్రం పెంచకుండా ఉండడం చాలా దారుణం అని అన్నారు. ఈ నెలతో కాంట్రాక్ట్ గడువు ముగుస్తున్న తరుణంలో ఈ వ్యవస్థను ప్రభుత్వము నేరుగా నిర్వహణ చేయాలని, డ్రైవర్లకు జీతాలు కూడా ప్రభుత్వమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేల చెల్లించాలని అన్నారు. డ్రైవర్ల సమస్యల కోసం సిఐటియు కార్మిక సంఘం డ్రైవర్లను ఐక్యం చేసి ఎంతటి పోరాటానికైనా సిద్ధపడుతుందని అటువంటి పరిస్థితులు ప్రభుత్వం రానివ్వకుండా సమస్యలు పరిష్కారం చేయడంలో కృషి చేయాలని అన్నారు. తొలుత తల్లి, బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్లు కలెక్టరేట్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ చినబాబు, వైస్ ప్రెసిడెంట్ నాగేంద్ర, రవి కుమార్,సూర్య భగవాన్, దుర్గా ప్రసాద్, దయ మహేశ్, సురేంద్ర కుమార్, మహేంద్ర బాబు, వెంకట రమణ, వీర బాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాల డ్రైవర్ల సమ్మె

రామచంద్రపురం: ప్రభుత్వ ఆసపత్రి నుంచి డెలివరీ జరిగిన బాలింతలను వారి బిడ్డలను తీసుకుని ఉచితంగా ఇంటికి అప్పగించే తల్లీబిడ్డల ఎక్స్ప్రెస్ వాహనాల డ్రైవర్లు మంగళవారం సమ్మె నిర్వహించారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి నుంచి బాలింతలను, వారి బిడ్డలను వారి వారి ఇంటికి చేర్చే తల్లి, బిడ్డల ఎక్ప్రెస్ లో పనిచేసే డ్రైవర్లకు జీతాలు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మూడు నెలలుగా వేతనాలు అందకపో వడంతో సమ్మె తలపెట్టారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బాలింతలు తమ బిడ్డలను తీసుకుని వేరే ఆటో లలో సొమ్ములు చెల్లించి స్వస్థలాలకు చేరుకున్నారు.

రామచంద్రపురంలో నిలిచిన తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్

డిటికి వినతిపత్రం అందిస్తున్న విఆర్ఒలు

క్రమబద్ధీకరణలో విఆర్ఒలకు అన్యాయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామ,వార్డు సచివాలయాల క్రమబద్ధీకరణ ప్రక్రియలో తమకు అన్యాయం జరుగు తుందని విఆర్ఒ లు నిరసన తెలిపారు. దీనిని సరి చేయాలంటూ మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒ ల సంఘం ఆధ్వర్యంలో భూ రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సుబ్రహ్మణ్యం కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్ఒ లు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 4ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మంది విఆర్ఒ లు ఉండగా 7,500 మందిని ప్రభుత్వం అదనపు సిబ్బంది గా గుర్తించడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. ప్రభుత్వం కనీసం సంప్రదింపులు కూడా జరపకుండా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ ల సంఘం మండల అధ్యక్షుడు నూర్ అహ్మద్ ఆలీషా, విఆర్ఒలు అవిడి రాము, నాగులపల్లి పల్లంరాజు, కోటిపల్లి వెంకటరమణ, పెట్టా బాలాజీ రావు, వి.ప్రసాద్, నవుండ్రు పుల్లయ్య, ఎస్‌కె.వలి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్
- వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

అమలాపురంలో ధర్నా చేస్తున్న వివిధ కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - అమలాపురం

కార్మికుల మెడకు ఉరితాడైన నాలుగు లేబర్ కోడులు రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీసం రూ.26,000 చెల్లించాలని, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి రెగ్యులరైజేషన్ చేయాలని, అంగన్‌వాడీ, ఆశా, మిడ్ డే మిల్, యనిమేటర్లు వంటి స్కీమ్ వర్కర్ల అందరిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, రైతుల పంటల గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని 200 రోజులకు పెంచి రోజు వేతనం రూ.600 చెల్లించాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు సిఐటియు, ఎఐటియుసి, వ్యవసాయకార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి గడియారం స్తంభం వరకు ర్యాలీగా వచ్చి గడియార స్తంభం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాని ఉద్దేశిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.దుర్గా ప్రసాద్, నూకల బలరామ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు పరిశ్రమల యాజమాన్యాలకు, కార్పొరేట్లకు, మోడీ ప్రియ మిత్రులకు లాభదాయకమని, దేశంలో కష్టించి పనిచేసే 90 శాతం మంది ప్రజాలైన కార్మిక వర్గానికి, ఉద్యోగులకు, అసంఘటితరంగ కార్మికులకు ఉరితాడు వంటివని విమర్శించారు. ఇవి అమలులోకి వస్తే ఇప్పటి వరకు కార్మికుల హక్కులైన పర్మినెంట్, బోనస్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటి, ప్రమాద నష్టపరిహార చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రద్దు చేయడబతాయని తెలిపారు. బ్రిటిష్ పాలన రోజులో బానిసబ్రతుకులు తిరిగి రాబోతున్నాయని కార్మిక వర్గాన్ని హెచ్చరించారు. కావున కేంద్రంలో ఉన్న 11 కార్మిక సంఘాలు ఉమ్మడిగా జూలై 9న దేశవ్యాప్తంగా సమ్మె చేసి ఈ నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయించుకోవాలని ఉద్యోగులకు, కార్మికులకు పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా కార్మికులకు లభించిన హక్కులను సైతం రద్దు చేస్తోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భీర ఎస్తేరురాణి, మలకా సుభాషిణి, జి.దైవకప పి.శివ, పీతల రామచంద్రరావు, మోకా శ్రీను, వి మోహన్‌రావు, సతీష్, పార్వతి, బండి వెంకటలక్ష్మి, ఈశ్వరి, మోకా శ్రీ ను, కాళ భీమరాజు, వి.నారాయణ, వెంకటశ్వరావు, ఎ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

మండపేటలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

మండపేట: స్థానిక కలువ పువ్వు సెంటర్లో మంగళవారం కార్మికులకు ఉరుతాడు లాంటి లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని సిఐటియు మండపేట పట్టణ కన్వీనర్ నరేంద్ర ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా కార్మికుల యాజమాన్యాలను బానిసలుగా చేయడం కోసమే ఈ లేబర్ కోడ్ తీసుకొచ్చిందని వాటిని వెంటనే రద్దు చేయాలన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వివిధ స్కీముల్లో పని పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన పథకం, డ్వాక్రా యానిమేటర్స్, స్కూల్ కంటెలిజెంట్ వర్కర్స్, అందరి నీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉపాధి హామీ చట్టాన్ని 200 రోజులు పెంచి, రోజువారి కనీస వేతనం రూ.600 చెల్లించాలని, తదితర సంస్థలపై ఆమె డిమా ండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.ావరాజు, మణికంఠ, గణేష్, డి.సురేష్, వెంకటలక్ష్మి, ధూళి రమేష్, చిన్నారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులు .. భారీ వర్షం

ప్రజాశక్తి - రామచంద్రపురం

అల్పపీడన ద్రోణి ప్రభావంతో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సామాన్యులు బయటకు వెళ్లేందుకు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడింది అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు కొనసాగాయి. ఏకధాటిగా కురిసిన వర్షం మధ్యాహ్నం 12 గంటల వరకు తెరిపిచ్చింది. భారీ వర్షానికి తోడు వ్యాపార వర్తక సంస్థలన్నీ మూతపడ్డాయి. భారీ వర్షంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పలు పల్లపు ప్రాంతాలు, పలు రోడ్లు జలమయమయ్యాయి . ఇక వ్యవసాయ పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. ఈ వర్షాలు మరో మూడు రోజులు పాటు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ ఏడాది వర్షాలు సాధారణం కంటే ఎక్కువగా కురుస్తాయని వాతావరణం శాఖ ఇప్పటికే ప్రకటించింది. .

మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షం

మాజీ సిఎం జగన్ దృష్టికి రైతుల సమస్యలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కూటమి ప్రభుత్వంలో రైతులకు న్యాయం జరగడం లేదని,ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, దీంతో రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందని తదితర సమస్యలను మాజీ సిఎం వైఎస్.జగన్ దృష్టికి తీసుకువెళ్లామని రామచంద్రపురం వైసిపి ఇన్‌ఛార్జి పిల్లి సూర్య ప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిల్లి సూర్య ప్రకాష్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి, రైతులు మాజీ సిఎం, పార్టీ అధినేత వైఎస్.జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం అలసత్వం వహించడంతో రైతులంతా తక్కువ ధరకే ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చిందని వారు వివరించారు. ఈ సందర్భంగా రైతు మేర్ల సత్యనారాయణ మాట్లాడుతూ దాల్వాకు 60 బస్తాల వరకు ధాన్యం పండించామని అయితే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో గిట్టుబాటు ధర లభించలేదన్నారు. దీనిపై ఆందోళన చేపట్టిన ఫలితం దక్కలేదు అన్నారు. ఈ మేరకు జగన్ దీనిపై ప్రతిపక్ష పార్టీ తమ వంతు పాత్ర పోషిస్తుందని ఆయన హామీ ఇచ్చారని పిల్లి సూర్య ప్రకాష్ వివరించారు. అంతకుముందు ఆయన మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతోనూ మాట్లాడారని సూర్య ప్రకాష్ తెలిపారు.

జగన్‌ను కలిసిన జగ్గిరెడ్డి, సూర్యప్రకాష్, కన్నబాబు, రైతులు

యుద్ధ ప్రాతిపదికన వంతెనలు నిర్మించాలి

- కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్
- వంతెన నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

స్థానిక జిల్లా కేంద్రంలో వాహనాల రాకపోకల రద్దీని నియంత్రించేందుకు యుద్ధ ప్రాతిపదికన నడిపూడి లాకు వద్ద, ఈదరపల్లి వద్ద నూతన వంతెనల నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ రహదారులు భవనాల శాఖ ఇంజినీ ర్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిధి లోని నడిపూడి లాకు వద్ద నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల నిర్వహణ తీరుతెన్నులను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేస్తూ నిర్దేశిత నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిర్మాణ పనులలో ఎటువంటి జాప్యాలకు తావివ్వరాదని ఆయన స్పష్టం చేశారు నిర్ణీత కాలవ్యవధిలో నిర్మాణ పనులను పూర్తి చేస్తూ ఈ యొక్క వసతులను జిల్లా వాసులకు అందుబాటులోకి తీసుకొని వస్తూ ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలని ఇంజినీర్లను సూచించారు. ఈ కార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ బి.రాము, డివిజనల్ ఇంజినీర్ వర్మ, జూనియర్ ఇంజినీర్ రమేష్, స్థానిక తహశీల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నడిపూడి వద్ద వంతెన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

నేరాలు ఘోరాలు

బంగారం, వెండి ఆభరణాల చోరీ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గుర్తుతెలియని వ్యక్తులు తిరిగి తాళాలు పగలగొట్టి బండారు, వెండి నగలు చోరీ చేశారు. ఈ ఘటన కపిలేశ్వరపురం లో జరిగింది. స్థానిక వైయస్సార్ కాలనీలో నివాసం ఉంటున్న ఎం.పోసియ్య నాగమణి దంపతులు ఇటీవల వేరే ఊరికి వెళ్లారు. సోమవారం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని చూసి అంగర పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రూ.లక్ష విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైయున్నట్లు వారు తెలిపారు.

గాయపడిన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గాయాల పాలైన వద్దుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. మంగళవారం పోలీసుల వివరాలు ప్రకారం మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన యార్లగడ్డ ముసలయ్య (78) ఈనెల 8న తన ఇంట్లో వంట చేసుకుంటున్నాడు. ఈ సమయంలో గ్యాస్ పొయ్యి నుండి మంటలు చెలరేగి శరీరం కాలిపోయి ముసలయ్యకు గాయాలయ్యాయి. అతని కుమారుడు వీర్రాజు హుటాహుటిన ముసలయ్యను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుండి చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ముసలయ్య సోమవారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలోని మందపల్లి సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందినట్లు కొత్తపేట ఎస్ఐ జి. సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కమ్మిరెడ్డి పాలెం కు చెందిన వాడ చైతన్య జనార్ధన(33) సోమవారం రాత్రి రావులపాలెం వెళ్లి తిరిగి 1.45 గంటలకు వస్తున్నాడు. ఈ సమయంలో మందపల్లి వంతెన సమీపంలోని కళ్యాణి సోం పాపిడి స్వీట్ షాపు ఎదురుగా జనార్ధన మోటార్ సైకిల్ ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా విక్రేతపై పీడీ యాక్ట్

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గిడజం గ్రామానికి చెందిన సారా విక్రేత గొలుసు లక్ష్మిపై పీడీ యాక్ట్‌ను నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పట్టాభి చౌదరి తెలిపారు. ఇప్పటికే ఆమెపై ఐదు కేసులు ఉన్నాయని, సారా అమ్మకాలు చేయవద్దని ఇటీవల ఆమెను హెచ్చరించినా మార్పు రాకపోవడంతో ఆమెపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఇకనుండి ఎవరైనా సారా అమ్మకాలు చేసినట్లయితే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడ పోర్ట్‌లోని రైస్ మిల్లులో పనిచేస్తున్న సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన నక్క నాగేంద్ర మంగళవారం బొలెరో వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. అయితే క్షతగాత్రుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్ వాహనం రావడంలో ఆలస్యం కావడంతో ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని పోలీస్ వాహనంలో ఎక్కించుకుని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం పై కేసు నమోదు చేసి స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సమయస్ఫూర్తితో క్షతగాత్రుని తన వాహనంలో ఆసుపత్రికి తరలించిన ట్రాఫిక్ ఎస్ఐని పలువురు అభినందించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక టవర్ కాలనీ వద్ద నిర్వహించిన పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి, ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం తెల్లవారుజామున తన సిబ్బందితో దాడి చేసి, వారి నుంచి రూ.6,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో తీపర్రు గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. బాలిక ఈ నెల 19వ తేదీ రాత్రి కాలకృత్యాల నిమిత్తం బయటకు వెళ్లిందన్నారు. అప్పటి నుంచి తిరిగి రాలేదని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు బాలిక వివరాలు తెలిస్తే 9440796642, 9154875611 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

మత్స్యకార యువకుడు గల్లంతు

గాలింపు చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకార యువకులు బోటు బోల్తా కొట్టడంతో ఒకరు గల్లంతవ్వగా మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటనపై అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సముద్ర తీరంలో వేట నిషేధం ఆంక్షలు ఉన్నప్పటికీ ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన ముగ్గురు మత్స్యకార యువకులు మెరుగుశ్యామ్ (19), వంక ఇసాక్(35), రామిశెట్టి వీరబాబు(35) సోమవారం అర్ధరాత్రి బోటుపై వేటకి వెళ్లారు. సముద్రపు అలలు తీవ్రంగా ఉండడంతో హోప్ ఐలాండ్ సమీపంలో బోటు బోల్తా కొట్టి సముద్రంలో యువకులు పడిపోయారు. వీరిలో వంక ఇసాక్, రామిశెట్టి వీరబాబు ఈదుకుంటూ హోప్ ఐలాండ్ చేరుకోగా, మెరుగు శ్యామ్ ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న అధికారులు గల్లంతయిన శ్యామ్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

క్లోజర్ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్
- జలవనరులు, డ్రెయినేజీ విభాగం ఇంజినీర్లతో సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

వేసవి కాలువలు మూసి వేత సమయంలో వివిధ గ్రాంట్ల కింద మంజూరైన క్లోజర్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. రుతు పవనాలు వచ్చే లోపల పూర్తి చేస్తూ ఖరీఫ్ సీజన్లో రైతులకు సజావుగా సాగునీరు, మురుగు నీరుపారేలా చర్యలు తీసుకోవాలని ఆయన జలవనరులు, డ్రెయినేజీ విభాగపు ఇంజినీర్లను ఆదేశించారు. మంగళ వారం స్థానిక కలెక్ట రేట్ నందు జలవనరులు డ్రైనేజీ విభాగ ఇంజినీర్లతో సంయుక్తంగా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులు వివిధ గ్రాంట్ల కింద మంజూరైన పనుల స్థితిగతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల వనరుల శాఖ, సిఎస్ఆర్, టిఆర్ 27 నిధుల ద్వారా మంజూరైన పనులను విడివిడిగా సమీక్షించి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదే శించారు .ముఖ్యంగా తూడు తొలగింపు, షట్టర్లు మరమ్మతు పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అత్య వసరమైన పనుల పట్ల మరింత శ్రద్ధ వహించి డెల్టా రైతు సంక్షేమం, అభ్యున్నతికి పాటు పడాల న్నారు. గ్రాంట్ల వారీగా పూర్తిచేసిన పనుల నివేదికలను సమర్పి ంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జలవ నరుల శాఖ కార్య నిర్వాహక ఇంజినీర్ బి.శ్రీనివాసరావు, జిల్లా డ్రెయినేజీ విభాగం కార్యనిర్వహక ఇంజినీర్ ఎంవివి.కిషోర్, వివిధ డివిజన్ల డివిజనల్ ఇంజినీర్లు, సహాయం ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ టవర్లు, లైన్ల ఆధునికీకరణ పనుల నిర్వహణకు వినియోగదారులు సహకరించాలి

జిల్లా వాసుల విద్యుత్ డిమాండ్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు టవర్లు లైన్లు ఆధునికీకరణ వంటి పనుల నిర్వహణ నిమిత్తం రామచంద్రపురం డివిజన్, కొత్తపేట డివిజన్లోని ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట మండలాల్లో మినహా మిగిలిన మండలాలలో విద్యుత్ పవర్ కట్ ముందుగా నిర్దేశించిన గ్రామాలలో ఉంటుందని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ఏపీ ట్రాన్స్‌కో, ఆర్‌బ్ల్యూఎస్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ టవర్లు ఏర్పాటు సందర్భంలో విద్యుత్ పవర్ కట్ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 90 టవర్లు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 60 టవర్లు నిర్మించినట్లు మిగిలిన 30 టవర్లు నిర్మాణానికి సంబంధించి రోజుకు రెండు చొప్పున నిర్మించనున్నట్లు తెలిపారు వీటిని నిర్మాణ సంద ర్భంలో విధించే విద్యుత్ అంతరాయ సమయాలను, గ్రామాలను ముందుగా తెలియజేస్తారన్నారు. ఆ మేరకు వినియోగదారుల సహకరించాలన్నారు. విద్యుత్ అంతరాయాలను ఉదయం 11 గంటల నుంచి 5 గంటల మధ్య సమయంలో విధిస్తారన్నారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్న నేపథ్యంలో ఈ విద్యుత్ అంతరాయాలను ప్రకటిస్తారన్నారు. స్థానిక విద్యుత్ అవసరాలలో 20 శాతం మేర ఈ యొక్క పనుల నిమిత్తం కోత విధిస్తారన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎటువంటి విద్యుత్ అంతరాయాలు (పవర్ కట్లు) విధించలేదని ఆయన స్పష్టం చేశారు. ఎపి ట్రాన్స్‌కో అధికారులు టవర్లు నిర్మాణ సందర్భంలో విధించే విద్యుత్ అంతరాయాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ముందుగా తెలియజేస్తారన్నారు. రొటేషన్ పద్ధతిలో ఎవరికి పెద్దగా ఇబ్బందులు లేకుండా ఒక సబ్ స్టేషన్లో ఉన్న నాలుగు ఫీడర్లు ఉంటే రోజు కొక ఫీడర్ చొప్పున ఒక గంట పాటు విద్యుత్ అంతరాయాన్ని విధిస్తారన్నారు. జిల్లా గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగానికి ఎటువంటి విద్యుత్తు అంతరాయాలను విధించరాదన్నారు. 24/7 తాగునీటి అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండాలని ఏపీ ట్రాన్స్‌కో ఇంజినీర్లను ఆదేశించారు. సరాసరిన కేవలం అమలాపురం డివిజన్లో మాత్రమే 24 గంటల వ్యవధిలో కేవలం 3 గంటల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఎపి ట్రాన్స్‌కో విశాఖపట్నం జోనల్ చీఫ్ ఇంజనీర్ బి.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అవసరాల దృష్ట్యా సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు లైన్ ఆధునీకరణ వంటి పనుల నిమిత్తం విద్యుత్ అంతరాయాలను 15 రోజులు పాటు విధిస్తారన్నారు. దీనికి విద్యుత్ వినియోగదారులు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో, ఎస్‌సి ఎస్. రాజబాబు, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సిహెచ్ఎన్‌వి. కృష్ణారెడ్డి, ఇరు విభాగాల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

పాఠశాల ప్రారంభం నాటికి ప్రతి విద్యార్థికి విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మీ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అమలాపురం మండల వనరుల కేంద్రం, జిల్లా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె 2025 -26 అకాడమిక్ సంవత్సరానికి రావలసిన స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు సరఫరా కాబడిన ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను, డిక్షనరీలను సురక్షిత ప్రదేశంలో స్టోర్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థి నమోదు ప్రక్రియ పెంచుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అలాగే జిల్లాలోని 6 నుంచి 18 సంవత్సరాల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వివరాలను సేకరించి వారిని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో నమోదు అయ్యేటట్లు చూడవలెనని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బివివి. సుబ్రహ్మణ్యం, అమలాపురం మండల విద్యాశాఖ అధికారి సరేళ్ళ దుర్గాదేవి, బండారులంక భవిత సెంటర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన డిఇఒ

మామిడికుదురు: లూటుకుర్రు హైస్కూల్ లో విద్యా మిత్ర స్టాక్ పాయింట్‌ను డిఇఒ షేక్ సలీం బాషా మంగళవారం పరిశీలించారు. టెక్స్ట్ బుక్‌లు పాఠశాల వారీ ఏర్పాటుచేసుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. బెల్టులు కూడా వచ్చాయని, ఇంకా బ్యాగ్‌లు, యూనిఫామ్, బూట్లు, సాక్స్ రావాల్సి ఉందన్నన్నారు. స్టూడెంట్స్ కిట్లను పరిశీలించి మండల టీమ్‌నకు తగు సూచనలు చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలలు పున్నప్రారంభం సమయానికి స్టూడెంట్స్ కిట్స్ అందజేస్తామన్నారు. ఈ కిట్స్ లో విద్యార్థులు కు స్కూల్ బ్యాగ్స్, షూస్, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, బెల్ట్స్, యూనిఫామ్, డిక్షనరీ లను అందజేస్తారు. మండలం లో 2025-26 విద్యా సంవత్సరం లో భాగంగా 3343 మంది విద్యార్థులకు ఇప్పటివరకు టెక్స్ట్ బుక్స్, బెల్ట్స్ వచ్చాయన్నారు. మిగిలిన ఐటమ్స్ అన్ని రావలసి ఉందన్నారు. ఆయన వెంట ఎంఇఒలు లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం మండల వనరుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి మమ్మీ

రిటైనింగ్ వాల్ పనులకు శంకస్థాపన

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురులో రూ.10 లక్షల వ్యయం తో చేపడుతున్న పంట కాలువ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు పి గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో పి. గన్నవరం నియోజకవర్గం గ్రామాలకు చెందిన ఇరిగేషన్ కాలువలలో, డ్రెయినుల్లో పూడికతీత పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఇరిగేషన్ డిఇఇ నాగేంద్ర కుమార్, ఇరిగేషన్ ఎఇఇ సుందర సింగ్, మానేపల్లి నీటి సంఘం అధ్యక్షులు మద్దాల తమ్మన్న, జనసేన నాయకులు విళ్ల సుబ్బారావు, టిడిపి మండల అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జనసేన మండల అధ్యక్షులు జాలెం శ్రీనివాస్, సంసాని పెద్దిరాజు, జాలెం సుబ్బారావు, డొక్కా నాథ్‌బాబు, కొమ్ముల జంగమయ్య, గుబ్బల పండు, మద్దాల ఆధిశేషు తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే టిడిపి ధ్యేయమని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు టిడిపి నియోజకవర్గ మినీ మహానాడు నగర పంచాయతీ పరిధిలోని స్థానిక విష్ణాలయం సెంటర్ డిఎల్ఎఫ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎంఎల్ఎ సుబ్బరాజు అధ్యక్షతన మహానాడు నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం మాజీ సిఎం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అదే విధంగా పార్టీకి అంకితభావంతో సేవ చేసి మరణించిన నాయకులకు సంతాపం తెలియజేశారు. అలాగే ఆపరేషన్ సింధూర్ లో అమరులైన వీర జవాన్లకి సమావేశం ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ సభలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టి చదివి వినిపించారు. ఐలాండ్ పరిసర ప్రాంతాల్లో రూ.323 కోట్లతో ఏటిగట్టు బలోపేతం, రోడ్డు నిర్మాణం, రూ.18 కోట్లతో లంక ఆఫ్ ఠానేలంక వివేకానంద వారధి వద్ద ఇరు పక్కల గ్రోయిన్స్ నిర్మాణం, రూ.230 కోట్లతో కునాలంక, గురజాపులంక, సలాదివారిపాలెం, మురమళ్ళ గ్రోయిన్స్ అభివృద్ధి పనులు, రూ.40 కోట్లతో భైరవపాలెం, మొల్లేటి మొగ, పల్లం, బలుసుతిప్ప తదితర గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న బిడ్జిలు వెడల్పు చేయడానికి రూ.72 కోట్లతో అంచనాలు రూపొందించామన్నారు. జి.మూలపాలెంలో రూ.44 కోట్ల అంచనాలతో గోగుల లంక గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణం, అలాగే యానాం నుంచి జొన్నాడ జాతీయ రహదారి వరకు ఏటిగట్టు వెడల్పు, ముమ్మిడివరం కాట్రేనికోన వయా అయినాపురం, జి.వేమవరం-గొర్రిపూడి ఆర్‌అండ్‌బి రోడ్డు నిర్మాణానికి చర్యలతో పాటు 2014-19 మధ్యలో నిర్మించుకున్న గృహాల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు, రైతులకు ఉపయోగపడే పుంత రోడ్లు, కాలవ గట్లును మార్కెట్ యార్డు, పాధి హామీ నిధులతో గ్రావెల్ రోడ్లు నిర్మాణానికి చర్యలతో పాటు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ ద్వారా నియోజవర్గంలో 40,932 మంది లబ్ధిదారులకు రూ.17.24కోట్ల పెన్షన్ లు అందిస్తున్నామన్నారు. అలాగే నియోజకవర్గంలో రూ.30 కోట్లతో 196 సిసి, డ్రెయిన్ ల నిర్మాణం చేపట్టనున్నామని, రూ.మూడు కోట్లతో ఆర్ అండ్ బి రోడ్లు మరమ్మతు, కొత్త రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామన్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలో రూ.25 కోట్లతో 37 చోట్ల రక్షిత మంచినీటి ట్యాంకులు, పైపులైన్లు నిర్మాణం, 161 కోట్ల ఏఐఐబి నిధులతో నగర పంచాయతీలో సమగ్ర మంచినీటి సరఫరా ప్రాజెక్ట్, ఒఎన్‌జిసి నష్టపరిహారం కింద చేపల వేట మీద ఆధారపడిన 20వేల మందికి రూ.133 కోట్ల పంపిణీ, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం కార్యక్రమం, అన్నదాత సుఖీభవ జూన్ లో రైతుల ఖాతాలో జమ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, చిక్కాల రామచంద్రరావు, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, గొల్ల కోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, టేకుమూడి లక్ష్మణరావు, దాట్ల పథ్వీరాజ్, అర్ధాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణ కుమార్, గొల్లపల్లి ధర్మారావు, వాడ్రేవు వీరబాబు, నడింపల్లి సుబ్బరాజు, రాయపరెడ్డి నీలకంఠేశ్వరరావు, చిక్కాల అంజబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో ఈనెల 24న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 11 కంపెనీలు 560కి పైగా ఉద్యోగాలకు జరిగే జాబ్ మేళాను నిరుద్యోగులు వినియోగించుకోవాలని అన్నారు. ఈ జాబ్ మేళాలో ఎస్ఎస్ సి, ఇంటర్, డిగ్రీ, బిటెక్, డి/బి/ఎం ఫార్మసీ చదివిన యువత అర్హులన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు బయోడేటా, ఆధార్, పాస్ పోర్ట్ సైజు ఫొటోతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 82476 45389 నెంబర్ ను సంప్రదించలన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరిశేషు, వికాస డిస్ట్రిక్ట్ మేనేజర్ రమేష్, ప్లేస్మెంట్ అధికారి కె.రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రావులపాలెం

రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి అమ్మసీతమ్మ సేవా సమితి మంగళవారం ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. మండలపరిధి రావులపాడుకి చెందిన పెచ్చేటి శ్రీనివాస్ రెండు కిడ్నీలు పాడై మంచానికే పరిమితం అయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న అమ్మ సీతమ్మ సేవాసమితి నిర్వాహకులు సానబోయిన బాలాజీ, కుడుపూడి సతీష్ బాధితుడిని పరామర్శించారు. బాధితునికి రూ.5 వేల సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకులు అమ్మసీతమ్మ సేవా సమితి ఆర్థిక సహాయం అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా మూర్తి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - అమలాపురం

సరస్వతమ్మ ముత్యాలు చారిటబుల్ మెంబెర్స్ ఆధ్వర్యంలో మాజీ ఐఆర్ఎస్ అధికారి టిఎస్ఎన్ మూర్తి పుట్టినరోజు సందర్భంగా అమలాపురంలోని కామాక్షి పీఠం లో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు మంగళవారం నిర్వహించారు. అనంతరం పిల్లలకు పండ్లు అందించారు. తదుపరి హరి మనోవికాస కేంద్రం, వృద్ధాశ్రమంలో పండ్లు అందించారు. ఈ సందర్భంగా నాతి శ్రీనివాసరావు మాట్లాడుతూ సరస్వతమ్మ ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. వేసవిలో గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పేరూరు వై.జంక్షన్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహిస్తూ ఎంతో మంది ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో తాళ్ల సాంబ మూర్తి, బొక్కా నాని, అరుణ్, కృప, తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకల్లో కేక్ తింటున్న చిన్నారులు

ద్రాక్షారామంలో మాజీ సైనిక ఉద్యోగులకు సన్మానం

జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామంలో సినీనటుడు జూనియర్ ఎన్‌టిఆర్ 42వ పుట్టినరోజును ఎన్‌టిఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశానికి సైనికులుగా సేవలందించి రిటైర్ అయిన మాజీ సైనికులకు ఇందాసి రాజు, జాన్ తాతారావు, వేపకాయలు మహేశ్వరరావు లను సన్మానించారు. అనంతరం ఇటీవల భారత్ పాక్ పై నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన మురళి నాయక్ చిత్రపటానికి మాజీ సైనికులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులు వాసంశెట్టి శ్యామ్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ భిమానులు సేవా కార్యక్రమాల విషయంలో మొదటి స్థానంలో ఉంటారని అభినందించారు అనంతరం అమర జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ అహ్మద్లిషా (బాబ్జి), ఎన్‌టిఆర్ సేవా సంఘం అధ్యక్షులు సాదే రాజేష్ కుమార్, సెక్రెటరీ మణికంఠ క్రాంతి కుమార్, సుబ్రహ్మణ్యం, ఎన్‌టిఆర్ అభిమానులు, లక్ష్మీ గణపతి యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

24న పుష్కరాలకు ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - రావులపాలెం

ప్రయాణికుల నుంచి వస్తున్న స్పందనను దృష్టిలో పెట్టుకొని సరస్వతీ నది పుష్కరాలకు ఎపిఎస్ ఆర్‌టిసి రావులపాలెం డిపో నుంచి ఈనెల 24న మరొక ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జిజివి.రమణ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరంగల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాలేశ్వరం, రామప్ప దేవాలయాల దర్శనాలతో పాటు సరస్వతీ నదిలో పుష్కర స్నానం చేసే విధంగా ఏర్పాటు చేశామని చెప్పారు. టిక్కెట్ ధర రూ.2200 అడ్వాన్స్ బుకింగ్ కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. సరస్వతి నది పుష్కరాలకు ఇప్పటికే రావులపాలెం డిపో నుంచి రెండు ఇంద్ర బస్సులు, రెండు సూపర్ లగ్జరీ బస్సులు పంపించామని చెప్పారు. పుష్కరాల ముగింపు సందర్భంగా ఆఖరి బస్సు ఈనెల 24న బయలుదేరుతుందని తెలిపారు.

జివివి.రమణ, డిఎం

జగన్‌ను కలిసిన ఐటి వింగ్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - రావులపాలెం

వైసిపి కొత్తపేట నియోజకవర్గం ఐటీ వింగ్ అధ్యక్షుడు కొవ్వూరి సుధాకర్ రెడ్డి మంగళవారం మాజీ సిఎం వైఎస్.జగన్‌ను తాడేపలిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రావులపాలెం గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడినిగా ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డితో కలిసి సుధాకర్ రెడ్డి మాజీ సిఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌తో పలు అంశాలపై చర్చించారు.

జగన్‌తో సుధాకర్‌రెడ్డి

మహారాజశ్రీ చోడవరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 139 / 2023

బిట్వీన్:
లెక్కల రామలక్ష్మి వగైరాలు . . . వాదులు
అండ్:
లెక్కల వేణుగోపాల్ వగైరాలు ... ప్రతివాదులు
టు:
డి-5: సబ్బవరపు గంగాభవాని, W/o.అప్పలనాయుడు, D/o.లేటు ఎర్రునాయుడు @ చిట్టిబాబు @ చిట్టినాయుడు, డో.నెం. 3/79/1, వివేకానందనగర్, Near ఎండాడ పెట్రోల్ బంక్, గీతం పోస్టు, విశాఖపట్నం.
డి-6: బర్ల కృష్ణవేణి, W/o. లేటు రాంబాబు D/o.లేటు ఎర్రునాయుడు @ చిట్టిబాబు @ చిట్టినాయుడు, సా॥ పి.తిమ్మాపురం గ్రామం పిఠాపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా. (ప్రస్తుతం కాకినాడ జిల్లా)
పై నెంబర్ను వాద్లు ప్రతివాదలుపైని పంపకం దావాదాఖలు చేయగా 5@6 ప్రతివాదులుకి సమన్లు సర్వు నిమిత్తం తే:19-6-2025 దీకి దావా వాయిదా వున్నది. అయితే పై నెంబరు దావాలో మీకు ఎట్టి ఆక్షేపణలు ఉన్ననూ మీరు **తే: 19-6-2025దీ ఉదయం 10-30కి** మీరు స్వయంగా గాని, లాయరుగాని ద్వారా గాని, పై కోర్టులో హాజరుఅయి తెలియపర్చు కోవలెను. లేననియెడలా మీ పరోక్షమందు తదుపరి ఉత్తర్వులు జారీ చేయడమగును అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

Chodavaram
Dt. 20-5-2025
P.PRAKASA RAO
Advocate, Chodavaram
Visakhapatnam.
Cell : 94410 19918

పుట్టిన తేదీ ధ్రువీకరణ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నేను పట్యం సాయిరామ్, తండ్రి: అప్పారావు, తల్లి: పట్యం సరోజిని, డో.నెం. 15-4-16/2, బాపూజీ నగర్, కొవ్వూరు, తూ॥గో॥జిల్లాకు చెందిన దంపతులకు 27-07-1953వ సంవత్సరంలో 3వ కుమారుడుగా జన్మించి ఉన్నాను. ఈ తేదీ నాయొక్క SSLC సర్టిఫికెట్ ననుసరించి ధ్రువీకరించబడినది. కావున నా జనన తేదీ ధ్రువీకరణపై ఎవరికైన ఏవిధమైన అభ్యంతరములున్నా నేటి నుండి 7 రోజుల లోపుగా కొవ్వూరు RDO ఆఫీసు నందు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

పట్యం సాయిరామ్
S/o. పట్యం అప్పారావు, బాపూజీ నగర్, కొవ్వూరు, సెల్. 8179516055

పాస్‌పోర్ట్ పడిపోయినది

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం, గొంది గ్రామానికి చెందిన కొప్పాడి దశరధుడు S/o. సుబ్బరాజు లు చెందిన నెంబరు **G 6836914** గల పాస్‌పోర్ట్ పడిపోయినది. ది. 17-04-2025 తేదీన పాస్‌పోర్ట్‌ను జిరాక్స్ తీయించుకునే నిమిత్తం ఇంటి వద్ద నుండి సఖినేటిపల్లి సెంటర్‌కు మోటారు సైకిల్‌పై వెళ్ళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

కొప్పాడి దశరధుడు
S/o. సుబ్బరాజు, డో.నెం. 1- 17
గొంది గ్రామం, సఖినేటిపల్లి మండలం

పత్రికా ప్రకటన



కీ॥శే॥ పట్టా తిరుపతిరావు (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, ఎస్.యానం, శ్రీరామ్ నగర్ గ్రామం, డో.నెం. 1-94 కాపురస్తులు పట్టా తిరుపతిరావు (లేటు), S/o. గంగరాజు (లేటు) గారి భార్య పట్టా లక్ష్మి ఇచ్చిన పత్రికా ప్రకటన.
నా భర్త **పట్టా తిరుపతిరావు గారు** ఎస్.యానం గ్రామంలో మా ఇంటి వద్ద 25-04-2006 సం॥రంలో మరణించారు. వీరి మరణం ఎస్.యానం గ్రామపంచాయతీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: పట్టా లక్ష్మి
W/o. పట్టా తిరుపతిరావు (లేటు), డోర్ నెంబర్: 1-94, ఎస్.యానం, శ్రీరామ్‌నగర్ గ్రామం ఉప్పలగుప్తం మండలం, సెల్: 7799110126

పత్రికా ప్రకటన



కీ॥శే॥ పెమ్మాడి అప్పారావు (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, ఎస్.యానం, శ్రీరామ్ నగర్ గ్రామం, డో.నెం. 1-94 కాపురస్తులు పెమ్మాడి అప్పారావు (లేటు), S/o. కొండయ్య (లేటు) గారి భార్య పెమ్మాడి సీత ఇచ్చిన పత్రికా ప్రకటన.
నా భర్త **పెమ్మాడి అప్పారావు గారు** ఎస్.యానం గ్రామంలో మా ఇంటి వద్ద 25-08-2017 సం॥రంలో మరణించారు. వీరి మరణం ఎస్.యానం గ్రామపంచాయతీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: పెమ్మాడి సీత
W/o. పెమ్మాడి అప్పారావు (లేటు), డోర్ నెంబర్: 1-94, ఎస్.యానం, శ్రీరామ్‌నగర్ గ్రామం ఉప్పలగుప్తం మండలం, సెల్: 7799110126